## వామపక్షాల మద్దతు లేకుండా కాంగ్రెస్ గెలవదు

**సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని**



హైదరాబాద్, మే 7 (నమస్తే తెలంగాణ): లోక్‌సభ ఎన్నికల్లో వామపక్షాల మద్దతు లేకుండా రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ గెలవలేదని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు తేల్చిచెప్పారు. హైదరాబాద్ బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం జరిగిన మీట్ ది ప్రెస్‌లో ఆయన మాట్లాడారు. బీజేపీ దేశానికి ప్రమాదకరమని ఆందోళన వ్యక్తం చేశారు. రాజ్యాంగాన్ని కాపాడాలంటే ఆ పార్టీని ఓడించాల్సిందేనని స్పష్టం చేశారు. ఆ పార్టీ నాయకులకు మించిన అవినీతిపరులు ఎవరూ లేరని విమర్శించారు. మోదీ పవర్‌ఫుల్‌గా మారి ప్రాంతీయ పార్టీ నేతలను జేబుల్లో పెట్టుకున్నారని విమర్శించారు. కమ్యూనిస్టుల జోలికొస్తే ఎవరైనా పతనం కావాల్సిందేనని చెప్పారు. తెలంగాణలో సెంటిమెంటు లేదని, బీజేపీ-బీఆర్‌ఎస్‌లను ఓడించాలని ప్రజలను కోరారు. స్థానిక సంస్థల ఎన్నికల నుంచి తమ బలమేంటో చూపిస్తామని, గౌరవప్రదంగా ఉంటేనే పొత్తులు ఉంటాయని, లేకపోతే పోటీ తప్పదని కూనంనేని సాంబశివరావు స్పష్టం చేశారు.

## కాంగ్రెస్ ప్రచారాన్ని అడ్డుకున్న రైతులు

భైంసా టౌన్, మే 7 : నిర్మల్ జిల్లా భైంసా మండలంలోని మిర్జాపూర్ గ్రామంలో మంగళవారం మాజీ ఎంపీపీ రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రచారాన్ని స్థానిక రైతులు అడ్డుకున్నారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు అమలు చేయలేదంటూ ఆగ్రహించిన ఇరవై మందికిపైగా రైతులు ప్రచారాన్ని అడ్డుతగిలి రుణమాఫీ, రైతుబంధుపై నిలదీశారు. 400కుపైగా ఇచ్చిన హామీలు ఏమయ్యాయని ప్రశ్నించారు. గ్రామంలో మతం పేరిట ఓట్లు అడిగితే ఊరుకునేది లేదని హెచ్చరించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి ఐదు నెలలు దాటినా హామీలు అమలు చేయడం లేదని నిరసన తెలిపారు.

## కాంగ్రెస్ నేత అద్దంకి దయాకర్‌పై కేసు

నిర్మల్ అర్బన్, మే 7 : బీజేపీ నాయకుడి ఫిర్యాదు మేరకు కాంగ్రెస్ సీనియర్ నేత అద్దంకి దయాకర్‌పై నిర్మల్‌లో కేసు నమోదైంది. నిర్మల్ పట్టణంలో ఈనెల 5న స్థానిక క్రషర్ గ్రౌండ్‌లో నిర్వహించిన జన జాతర సభలో కాంగ్రెస్ సీనియర్ నేత అద్దంకి దయాకర్ అసభ్య పదజాలంతో మాట్లాడినట్టు బీజేపీ దళిత మోర్చా నిర్మల్ జిల్లా అధ్యక్షుడు రాచకొండ సాగర్ పేర్కొన్నారు. హిందూ దేవతలు రాముడు, సీతపై నీచంగా మాట్లాడిన దయాకర్‌పై రాచకొండ సాగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఐపీసీ సెక్షన్ 504, 504/2 కింద కేసు నమోదు చేసినట్టు పట్టణ సీఐ అనిల్ తెలిపారు.

## కాంగ్రెస్ కార్యకర్త అవతారమెత్తిన ఎస్సై!

- ఇసుక దోచుకో.. కాంగ్రెస్‌కు ఓటేసుకో
- ఇసుకట్రాక్టర్ల యజమానులకు హుకూం జారీ
- ట్రిప్పనకు రూ.వెయ్యి వసూలు?

మూసాపేట, మే 7 : మహబూబ్‌నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గంలోని ఓ ఎస్సై కాంగ్రెస్ కార్యకర్త అవతారమెత్తాడు. ఇష్టమొచ్చినట్టుగా 'ఇసుక దోచుకోండి.. కానీ కాంగ్రెస్ పార్టీకి ఓటు వేయండి.. మీకు పరిచయం ఉన్న వారితో కూడా కాంగ్రెస్‌కు ఓటేయమని చెప్పండి' అంటూ హుకూం జారీ చేసినట్టు సమాచారం. ట్రాక్టర్ యజమానులతో మాట్లాడుతూ.. 'మీ గ్రామ వాగు నుంచి ఎప్పుడైనా.. ఎక్కడికైనా ఇసుక కొట్టుకోండి.. కాంగ్రెస్ పార్టీకి ఓటు వేయాలి.. పలువురితో వేయించాలి.. లేదంటే మీపై కేసులు నమోదు చేసి తాట తీస్తా'నని భయపెడుతున్నట్టు తెలిసింది. ఎన్నికల సమయంలో అధికారులు పార్టీలకతీతంగా ప్రజల పక్షాన ఉంటూ.. ఎలాంటి ప్రలోభాలు జరగకుండా చూడాలి. కానీ ఓ పోలీసే ఇలా చెప్పడమేంటని ప్రజలు చెవులు కొరుక్కుంటున్నారు. ఆయన అధికార పార్టీకి మేలు చేస్తున్నట్టు నటిస్తూనే మరో వైపు ఇసుక ట్రాక్టర్ ట్రిప్పునకు రూ.వెయ్యి చొప్పున వసూలు చేస్తూ చేతివాటాన్ని ప్రదర్శిస్తున్నట్టు ఆరోపణలు ఉన్నా యి. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సొంత జిల్లా, పార్లమెంట్ ఎన్నికలు కావడంతో ఎలాగైనా గెలవాలన్నదే అధికార పార్టీ లక్ష్యంగా పెట్టుకున్నట్టు స్పష్టమవుతున్నది.



మంచిర్యాల జిల్లా వేమనపల్లి మండలంలోని నీల్వాయిలో నేలరాలిన మామిడికాయలు



యాదగిరిగుట్ట ఆలయంపై మెరిసిన మెరుపులు

# వేసవిలో రికార్డు వాన

## శేరిలింగంపల్లిలో 10.8 సెం.మీ • హైదరాబాద్‌లో 3 గంటల వాన

- పలు జిల్లాల్లో ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో వడగండ్ల వానలు
- ఒక్కసారిగా చల్లబడిన వాతావరణం
- వచ్చే ఐదురోజులు మోస్తరు వర్షాలు
- ఆయా జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ
- హైదరాబాద్ వాతావరణశాఖ వెల్లడి
- వేర్వేరు ప్రమాదాల్లో నలుగురు మృతి



జనగామ మండలం శామీర్‌పేటలో జాతీయ రహదారిపై కూలిన భారీ వృక్షం

హైదరాబాద్, మే 7 (నమస్తే తెలంగాణ): వేసవిలో ఎప్పుడూ లేనంతగా మంగళవారం రాష్ట్రంలో రికార్డు స్థాయి వర్షపాతం నమోదైంది. మధ్యాహ్నం వరకు ఎండ ఉండగా, సాయంత్రం ఒక్కసారిగా వాతావరణం చల్లబడింది. హైదరాబాద్‌లో మూడు గంటలపాటు కురిసిన భారీ వర్షం కురిసింది. ప్రధాన కూడళ్లలో భారీగా ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. శేరిలింగంపల్లిలో అత్యధికంగా 10.8 సెం.మీ., కేపీహెచ్‌పీలో 10.73, సికింద్రాబాద్‌లో 8.4, అల్వాల్‌లో 7 సెం.మీ., గాజులరామారంలో 4 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైనట్టు హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. నల్లగొండ, సిద్దిపేట, మెదక్ జిల్లాల్లో 6 సెం.మీపైగా వాన కురిసినట్టు తెలిపింది. పలు జిల్లాల్లో ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన వడగండ్ల వానలు పడ్డాయి.

### మరో ఐదురోజులు భారీ వానలు

రాష్ట్రంలో రాబోయే ఐదు రోజులపాటు భారీ వర్షాలు కురుస్తాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరించింది. ఈశాన్య జిల్లాల్లో భారీ వర్షాలు పడే అవకాశం ఉండటంతో తొమ్మిది జిల్లాలకు హెవీ రైన్ అలర్ట్ ప్రకటించింది. ఉరుములు, మెరుపులు, గంటకు 40-50 కి.మీ వేగంతో ఈదురుగాలులతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉన్నదని హెచ్చరించింది. బుధవారం ఆసిఫాబాద్, మంచిర్యాల, కొత్తగూడెం, ఖమ్మం, నల్లగొండ, సూర్యాపేట, జనగామ, యాదాద్రి భువనగిరి, నాగర్‌కర్నూల్ జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేసింది. పెద్దపల్లి, భూపాలపల్లి, ములుగు, రంగారెడ్డి జిల్లాల్లో ఉరుములు, మెరుపులు గంటకు 40-50 కి.మీ వేగంతో ఈదురుగాలులతో కూడిన వర్షాలు పడతాయని పేర్కొన్నది.

### సహాయక చర్యలు చేపట్టండి

**అధికారులకు ముఖ్యమంత్రి ఆదేశం**

హైదరాబాద్, మే 7 (నమస్తే తెలంగాణ): రాష్ట్రవ్యాప్తంగా ఈదురుగాలులతో కూడిన భారీ వర్షాలు కురవడంతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులతో సమీక్షించారు. హైదరాబాద్ నగరంలోని లోతట్టు ప్రాంతాలు జలమయమవడం, ట్రాఫిక్ సమస్యలు, విద్యుత్తు అంతరాయాలపై తక్షణమే చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. వరంగల్ పర్యటనలో ఉన్న ఆయన అక్కడి నుంచే జీహెచ్‌ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రోస్, సిటీ పోలీస్ కమిషనర్ కే శ్రీనివాసరెడ్డి, ట్రాన్స్ కో సీఎండీ ఎస్ఏఎం రిజ్వీ, ఇతర ఉన్నతాధికారులతో సమీక్షించారు. భారీ వర్షాలు, ఈదురుగాలులతో పలు ప్రాంతాల్లో విద్యుత్తు సరఫరా నిలిచిపోయిందని అధికారులు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ముఖ్యమంత్రి.. వెంటనే సమస్యను పరిష్కరించి విద్యుత్తు సరఫరాను పునరుద్ధరించాలని ఆదేశించారు. లోతట్టు ప్రాంతాల్లో జలమయమైన కాలనీల్లో ప్రజలకు అవసరమైన చేయూతను అందించాలని సూచించారు.



హైదరాబాద్‌లో కురిసిన వర్షానికి భారీగా ట్రాఫిక్ జామ్

### ఈదురుగాలులతో కూడిన వడగండ్ల వానలు

హైదరాబాద్‌సహా పలు జిల్లాల్లో మంగళవారం మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిశాయి. ఉమ్మడి కరీంనగర్, కుమ్రంభీం ఆసిఫాబాద్, ములుగు జిల్లాల్లో పలుచోట్ల ఈదురుగాలులతో భారీ వర్షం పడింది. పెద్దపల్లి, సిరిసిల్ల, మెదక్, జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. కరీంనగర్‌తోపాటు మానకొండూరు, హుజూరాబాద్‌లో వానపడింది. పలు చోట్ల ఈదురుగాలులతో వడగండ్ల వానలు పడ్డాయి. పెద్దపల్లి, సిరిసిల్ల, బోయినపల్లి, వేములవాడ, జగిత్యాల జిల్లా మల్యాల, పెగడపల్లిలో ఈదురుగాలులతో పలుచోట్ల వాన కురిసింది. కరీంనగర్ జిల్లాలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పర్యటనకు భారీ వర్షం అంతరాయం కలిగించడంతో సభ రద్దు అయింది. ఖమ్మం జిల్లా వ్యాప్తంగా ఈదురుగాలులతో వర్షం కురిసింది. ములుగు జిల్లా కన్నాయిగూడెం, ఏటూరునాగారం, తాడ్వాయి మండలాలు, కొత్తగూడెం జిల్లా ఇల్లెందులో వాన కురిసింది. కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా వాంకిడి, చింతలమానేపల్లి, పెంచికల్ పేట, కాగజ్‌నగర్, కౌటాలా, సిర్పూర్(టీ)లో భారీ వర్షం కురిసింది. మేడ్చల్ -మల్కాజిగిరి జిల్లా కండ్లకోయ, దుండిగల్, గండిమైసమ్మతోపాటు మియాపూర్, చందానగర్, గచ్చిబౌలి, రాయదుర్గంలో వానపడింది. మంచిర్యాల జిల్లాలో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురుస్తున్నాయి.

### వేర్వేరుచోట్ల నలుగురు మృతి

మెదక్ జిల్లా కౌడిపల్లి మండలంలోని రాయిలాపూర్ గ్రామ శివారులో గోడ కూలీ ఇద్దరు మేస్త్రీలు మృతిచెందారు. ఏపీకి చెందిన చింతపండు సుబ్రహ్మణ్యం(45), మాదాస్ నాగు (35) కోళ్ల ఫారం నిర్మాణ పనులు చేస్తుండగా వర్షం కురిసింది. గోడ ఒక్కసారిగా కూలి సుబ్రహ్మణ్యం, మాదాస్ నాగుపై శిథిలాలు పడటంతో అక్కడికక్కడే మృతిచెందారు. సిద్దిపేట జిల్లా కుకునూరుపల్లిలో కుమ్మరి మల్లేశం(36) అనే రైతు పొలం వద్ద వేపచెట్టు కింద నిలబడి ఉండగా వేపచెట్టుపై పిడుగు పడడంతో మృతి చెందాడు. వరంగల్ నుంచి ఇల్లందకు వస్తున్న ట్రాక్టర్‌పై చెట్టు పడటంతో ట్రాక్టర్ డబ్బాలో కూర్చొని వస్తున్న ఇల్లందకు చెందిన ఇంజినీరింగ్ విద్యార్థి ఆబర్ల దయాకర్(22)కు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు దవాఖానకు తరలిస్తుండగా మృతి చెందాడు.

### అత్యవసరమైతే 100కి డయల్ చేయండి

తెలంగాణవ్యాప్తంగా పలు ప్రాంతాల్లో భారీ వర్షాలు కురుస్తుండటంతో పోలీసుశాఖ హెచ్చరికలు జారీచేసింది. పిడుగుల ప్రమాదం దృష్ట్యా చెట్ల కింద ఉండటం, ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్తు స్తంభాలను తాకటం వంటివి చేయద్దని కోరారు. శిథిలావస్థలో ఉన్న భవనాలకు దూరంగా ఉండాలని, అత్యవసర సమయాల్లో డయల్ 100కు కాల్ చేయాలని కోరారు.



మంచిర్యాల జిల్లా కన్నెపల్లి కొనుగోలు కేంద్రంలో తడిసిన ధాన్యం

## ..అన్నదాత ఆగమాగం

మొదటిపేజీ తరువాయి...

గురయ్యారు. సిద్దిపేట జిల్లా రాయపోల్, మిరుదొడ్డి, కుకునూరుపల్లి, కొండపాక, గజ్వేల్ మండలాల్లో మంగళవారం కురిసిన వానకు ధాన్యం తడిసింది. సిద్దిపేట మార్కెట్ యార్డులో పోసిన ధాన్యం వర్షానికి కొట్టుకుపోయింది. చేర్యాల, మద్దూరు, ధూళిమిట్ట మండలాల్లో బలమైన ఈదురుగాలులకు విద్యుత్తు స్తంభాలు, చెట్లు విరిగిపడ్డాయి. పిట్టలగూడెంలో గాలివానకు రేకుల ఇండ్లు ధ్వంసమయ్యాయి. చేర్యాల మండలంలోని వీరన్నపేటలో కమ్మకోలు రాజు రేకుల ఇల్లు పూర్తిగా ధ్వంసమైంది. ఉమ్మడి ఖమ్మం జిల్లా వేంసూరు మండలంలో మామిడి కాయలు రాలి రైతులకు తీవ్ర నష్టం వాటిల్లింది. పర్ణశాలలో ఈదురుగాలులకు పలు షాపులు, ఇండ్ల పైకప్పులు ఎగిరిపోయి పాక్షికంగా దెబ్బతిన్నాయి.

### విరిగిన విద్యుత్తు స్తంభాలు

ఉమ్మడి వరంగల్ జిల్లాలో పలుచోట్ల చెట్లు కూలగా, విద్యుత్తు స్తంభాలు విరిగాయి. గణపురం, మహదేవపూర్, పలిమెల మండలాల్లోని కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడిసి ముద్దయింది. ములుగు, ఏటూరునాగారం, మంగపేట, గోవిందరావుపేట, వెంకటాపూర్, వెంకటాపురం మండలాల్లో ధాన్యం రాశులు తడిశాయి. ఖానాపురం, ఆత్మకూరు, చెన్నారావుపేట, వర్ధన్నపేట మండలాల్లో ఈదురుగాలులకు పలువురి ఇంటిపై కప్పులు ఎగిరిపడ్డాయి. జనగామ, బచ్చన్నపేట, నర్మెట, తరిగొప్పుల, రఘునాథపల్లి, స్టేషన్‌ఘన్‌పూర్, చిల్పూరు మండలాల్లో మామిడి కాయలు రాలడం, కూరగాయలు, పండ్ల తోటలకు స్వల్పంగా నష్టం వాటిల్లింది.

### నేలరాలిన మామిడి కాయలు

కరీంనగర్ ఉమ్మడి జిల్లాలో కొనుగోలు కేంద్రాల్లోనే ఆరబోసిన ధాన్యం తడిసిముద్దయింది. చొప్పదండి, గంగాధరలోని మార్కెట్‌లోనూ ధాన్యం తడిసింది. రేకొండలో చందవేని పద్మ, అల్లెపు రాములు ఇండ్లు నేలకూలాయి. సీతారాంపూర్‌లో విద్యుత్తు స్తంభాలు నేలకూలాయి. లంబాడి పల్లె గాగిరెడ్డిపల్లి రహదారి మధ్య చెట్టు విరగడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. పెద్దపల్లి వ్యవసాయ మార్కెట్ యార్డులో ధాన్యం తడిసిపోగా, పలువురి ధాన్యం నీటిలో కొట్టుకపోయింది. ఓదెల, కాల్వశ్రీరాంపూర్ మండలాల్లోని పలు గ్రామాల్లోని కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడిసిపోయింది. ధర్మారం, సుల్తానాబాద్ వ్యవసాయ మార్కెట్ యార్డుల్లో ధాన్యం తడిసి ముద్దయింది. జగిత్యాల జిల్లా పెగడపల్లి మండలంలోని కొనుగోలు కేంద్రాల్లోనూ ధాన్యం తడిసి ముద్దయింది. ఆరవల్లికి చెందిన రైతు కట్ల రాజేందర్ రెండెకరాల మక్క నేలవాలింది. మల్లాపూర్‌లో గాలికి మామిడికాయలు పూర్తిగా నేలరాలాయి. కరీంనగర్ జిల్లా రెబల్లెలో నాలుగు ఎకరాలల్లోని బొప్పాయి చెట్లు నెలకొరిగాయి.

### తడిసిన ఆరబెట్టిన ధాన్యం

సంగారెడ్డి జిల్లా జోగిపేట వ్యవసాయ మార్కెట్‌తోపాటు చింతకుంట కొనుగోలు కేంద్రాలు, రంసాన్‌పల్లి, దానంపల్లి, మాసన్‌పల్లి, ఎర్రారం శివారుల్లో రైతులు రోడ్లపై ఆరబెట్టిన ధాన్యం తడిసిపోయింది. హత్నూర, మాధుర గ్రామాల్లో ధాన్యం బస్తాలు తడిశాయి. పెద్దమందడి మండలం అల్వాల గ్రామ శివారులో పిడుగుపాటుకు 48 గొర్రెలు మృతి చెందాయి.



పెద్దపల్లి జిల్లా ధర్మారం మండలకేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో తడిసిన ధాన్యాన్ని కుప్పగా చేస్తున్న రైతులు

## పడిపోయిన విద్యుత్తు డిమాండ్

- తగ్గిన 2000 మెగావాట్ల వాడకం
- ఒక్కసారిగా మారిన వాతావరణం
- ఉత్తర తెలంగాణలో సగానికి డౌన్
- దక్షిణ తెలంగాణలోనూ పడిపోయిన వెయ్యి మెగావాట్ల కరెంట్ వినియోగం

హైదరాబాద్, మే 7 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో వాతావరణం ఒక్కసారిగా మారిపోవడంతో విద్యుత్తు వినియోగం కూడా గణనీయంగా పడిపోయింది. రాష్ట్రవ్యాప్తంగా 2000 మెగావాట్ల వాడకం తగ్గిపోయింది. సోమవారం ఒక్కరోజే ఖమ్మంలో 315 మెగావాట్ల విద్యుత్తు వాడగా, అదే మంగళవారానికి వచ్చేసరికి కేవలం 55 మెగావాట్లే వినియోగించారు. అంటే దాదాపు 260 మెగావాట్లు డౌన్. అదే వరంగల్లో 476 నుంచి 163, కరీంనగర్ 838 నుంచి 413, ఆదిలాబాద్ 285 నుంచి 82, నిజామాబాద్ 395 నుంచి 208 మెగావాట్లకు విద్యుత్తు వినియోగం పడిపోయింది. ఇలా రాష్ట్రమంతటా విద్యుత్తు వినియోగం తగ్గిపోయింది. సోమవారం వరకు భానుడి భగభగలతో విద్యుత్తు వాడకం అమాంతం పెరిగింది. సోమవారం ఒక్కసారిగా రాష్ట్రంలో వాతావరణం మారిపోయింది. మరీ ముఖ్యంగా ఉత్తర తెలంగాణ జిల్లాల్లో వర్షాలు పడటంతో విద్యుత్తు వినియోగం సగానికి సగం తగ్గింది. దక్షిణ తెలంగాణలోనూ వెయ్యి మెగావాట్లకుపైగా డిమాండ్ తగ్గింది. రాబోయే ఐదు రోజులపాటు ఉత్తర తెలంగాణలో వర్షాలు కురిసే అవకాశమున్నట్టు వాతావరణశాఖ ప్రకటించింది. విద్యుత్తు డిమాండ్ మరింత తగ్గే అవకాశాలున్నాయి. సోమవారం రాష్ట్రంలో 10,847 మెగావాట్లు గరిష్ఠ విద్యుత్తు డిమాండ్ నమోదు కాగా, మంగళవారం 8,848 మెగావాట్లకు చేరింది. అత్యధిక డిమాండ్ టీఎస్‌ఎస్పీడీసీఎల్ లోనే నమోదయ్యింది.

**సగటు విద్యుత్తు వినియోగం (మెగావాట్లల్లో)**


| కంపెనీ | మే 6 | మే 7 | నిరుడు ఇదే రోజు |
|---|---|---|---|
| టీఎస్‌ఎన్పీడీసీఎల్ | 2,400 | 941 | 1,674 |
| టీఎస్‌ఎస్పీడీసీఎల్ | 8,129 | 7,633 | 5,016 |
| స్టేట్ మొత్తం డిమాండ్ | 0,847 | 8,848 | 6,897 |

## తిరుపతిలోనూ నిత్యాన్నదానం

హైదరాబాద్, మే 7 (నమస్తే తెలంగాణ): శ్రీవారు కొలువైన తిరుమలతోపాటు శ్రీనివాసుడి పాదాల చెంత ఉన్న తిరుపతిలోనూ నిత్యాన్నదానం నిర్వహించాలని టీటీడీ నిర్ణయించింది. తిరుమలను దర్శించుకొనే భక్తులు.. తిరుపతిలోని దర్శనీయ ప్రాంతాలను కూడా సందర్శిస్తూ ఉంటారు. వీరి కోసం పలుచోట్ల అన్నప్రసాద వితరణ చేపడుతున్నారు. కాగా, మే 12 నుంచి కోదండరామస్వామి ఆలయంలో పుష్పయాగం నిర్వహించనున్నట్టు టీటీడీ తెలిపింది. ఇందుకు భక్తులు రూ.వెయ్యి చెల్లించి టికెట్ కొనుగోలు చేసి పుష్పయాగంలో పాల్గొనాలని కోరింది.

# వడ్లమ్మబోతే నిలువుదోపిడీ!

- ఒక్క రైతుపై ఐదు రకాల మోసం
- తాలు, దుబ్బ పేరిట అధిక తూకం
- లారీకి పది బస్తాల దాకా మిల్లర్ల కోత
- ఇటు కేంద్రం నిర్వాహకుల చేతివాటం
- హమాలీ చార్జీలు అదనపు భారం
- ఏ గేడ్ర్ ధాన్యానికి కామన్ గ్రేడ్ డబ్బు
- పర్యవేక్షణలో అధికారులు విఫలం



రైతు అమ్మిన ధాన్యంలో ఔటర్న్ చూడగా 100 గ్రాముల్లో 68.5 గ్రాములు వచ్చిన ధాన్యం

మంచిర్యాల, మే 7(నమస్తే తెలంగాణ ప్రతినిధి) : ఎన్నో ఆశలతో ఎవుసం చేసి తీరా పండిన వడ్లను అమ్మబోతే రైతులు కొనుగోలు కేంద్రాల్లో నిలువుదోపిడీకి గురవుతున్నరు. తాలు, దుబ్బ అంటూ సెంటర్ల నిర్వాహకులు 40కిలోలకు 42 కిలోల దాకా జోకుతున్నరు. చచ్చీచెడి మిల్లులకు వెళ్లాక ఒక్కో లారీ లోడ్‌కు పది బస్తాల దాకా మిల్లర్లు కోత పెడుతున్నరు. మిల్లరే పది బస్తాల దాకా దోచుకుంటే మరోవైపు కేంద్రాల నిర్వాహకులు తమ చేతివాటంతో మరిన్ని బస్తాలు మింగేస్తున్నరు. ఇంకా విషాదమేమిటంటే గ్రేడ్-ఏ రకం ధాన్యం అమ్మిన రైతులకు కామన్ గ్రేడ్ డబ్బులే కట్టిస్తున్నరు. ఇవన్నీపోను క్వింటాల్ వడ్లపై రూ.50 చొప్పున హమాలీ చార్జీలు అదనంగా పడుతున్నాయి. మంచిర్యాల జిల్లాలోని పలు ధాన్యం కొనుగోలు కేంద్రాలను 'నమస్తే తెలంగాణ' మంగళవారం పరిశీలించగా ఈ దోపిడీ తంతు బయటపడింది. అధికారుల పర్యవేక్షణ లేకనే ఇలా జరుగుతున్నట్టు తెలుస్తున్నది.

### అధిక తూకం.. మిల్లుల్లో కోత

వడ్లలో తాలు, మట్టి ఉందని చెప్పి కొనుగోలు కేంద్రాల్లో 40 కిలోలు జోకాల్సిన బస్తాను 42 కిలోల దాకా జోకుతున్నారు. కేంద్రం నుం చి మిల్లుకు వెళ్లాక ఒక్క లారీ లోడ్‌లో పది బస్తాల వరకు మిల్లర్లు కోత పెడుతున్నారు. 283 బస్తాలు మిల్లుకు తీసుకెళ్లిన ఓ రైతుకు 278 బస్తాలకే డబ్బులు చెల్లించారు. ఇదే లారీలో పోయిన మరో రైతు 230 బస్తాలు తీసుకెళ్తే 226 బస్తాలకే డబ్బులు పడ్డాయి. ఒక లారీలో మంచిర్యాల జిల్లా సమీపంలోని గాయత్రి మిల్లుకు 685 బస్తాలు తీసుకెళ్లిన ఇద్దరు రైతులకు 9 బస్తాలు కోతపెట్టి 674 బస్తాలకే ట్రక్ షీట్ ఇచ్చారు.

### గ్రేడ్-ఏ ధాన్యానికి కామన్ డబ్బు

సాధారణంగా యాసింగిలో గ్రేడ్-ఏ 1010 ధాన్యాన్నే రైతులు పండిస్తారు. ఈ రకం ధాన్యం క్వింటాలుకు రూ.2,203 చెల్లించాలి. కానీ, కామన్ గ్రేడ్‌కు ఇచ్చే రూ.2,183 మాత్రమే చెల్లిస్తున్నారు. 100 క్వింటాళ్లు అమ్మిన రైతు రూ.2వేల వరకు నష్టపోవాల్సి వస్తున్నది. రైతు బోర్లకుంట శంకరయ్య 283 బస్తాల ఏ గ్రేడ్ ధాన్యం అమ్మగా 278 బస్తాలే కొన్నట్లు రసీదు ఇచ్చారు. ఈ 278 బస్తాల్లో 111.2 క్వింటాళ్లకు గాను రూ.2203 చొప్పు న రూ.2,44,973 రావాలి. కానీ కామన్ గ్రేడ్‌గా చూపించి క్వింటాల్‌కు రూ.2183 చొప్పున రూ.2,42,749 చెల్లించారు.

### కొనుగోలు కేంద్రం నిర్వాహకుల దోపిడీ

భీమారం మండలం బూర్గుపల్లి డీఆర్డీకే కొనుగోలు కేంద్రంలో ఇటీవల ఓ రైతుకు చెం దిన వడ్లను 607 బస్తాలుగా తూకం వేశారు. తాలు, మట్టి ఉందని చెప్పి మిల్లర్ 24 బస్తాలు కోత పెట్టి 583 బస్తాలకు రసీదు ఇచ్చాడు. ఇక కేంద్రం నిర్వాహకుడు 576 బస్తాలకే కుదించి కొనుగోలు పత్రం ఇచ్చాడు.

### మిల్లర్లకు రెండు రకాలు లాభం

కేంద్రాల నుంచి వచ్చిన ధాన్యానికి కోత పెడుతున్న మిల్లర్లు, ఆ ధాన్యాన్ని ఎఫ్‌సీఐకి అప్పగించే సమయంలోనూ అదే స్థాయిలో లబ్ధిపొందుతున్నారు. ఎఫ్‌సీఐకి ధాన్యం అప్పగించే సమయంలో క్వింటాలుకు 63 కిలోల ధాన్యం, ఐదు కిలోల నూకలు అప్పగిస్తున్నారు. మిల్లర్లు అటు రైతుల పొట్ట కొట్టడంతో పాటు ఇటు ప్రభుత్వాన్ని మోసం చేస్తున్నారని తేలిపోతున్నది.

### ఐదు బస్తాలు కోసిండ్రు..



నేను ఏగ్రేడ్ ధాన్యం తెచ్చిన. తాలు, మట్టి లేకుండా చూసి తీసుకచ్చిన. తేమశా తం మంచిగనే వచ్చింది. హమాలీలు లోడ్ చేసేటప్పుడు ఇలాంటి నంబర్ వన్ వడ్లను ఎక్కడా చూడలేదన్నరు. ఏ గ్రేడ్ ధాన్యం తెచ్చినట్లు చీటీ రాసిచ్చిండ్రు. మిల్లుకు 283 బస్తాలు తీస్కపోతే 278 బస్తాలేనని తీసుకున్నరు. ఎందుకు కోత పెట్టిండ్రు అంటే ఎవ్వరూ సమాధానం చెప్పలే.

– బోర్లకుంట శంకరయ్య, దోనబండ, హాజీపూర్ మండలం, మంచిర్యాల జిల్లా

### రెండు బస్తాలు కట్ చేసిండ్రు



నేను 132 బస్తాల ధాన్యం తెస్తే నలబై ఒకటిన్నర కిలోల చొప్పుల తూకం వేసిండ్రు. మిల్లుకు పోయినంక రెండు బస్తాలు కోతపెట్టి 130 బస్తాలకే ట్రక్ షీట్ ఇచ్చిండ్రు. ఏ గ్రేడ్ ధాన్యం తెస్తే కామన్ గ్రేడ్ డబ్బులే వేసిండ్రు. మా బావకు కూడా రెండు బస్తాలు కట్టింగ్ పెట్టి, కామన్ గ్రేడ్ డబ్బులే వేసిండ్రు. ఒక్క మాట కూడా చెప్పకుండా కంటింగ్ ఎట్ల పెడుతరు? మధ్యల మిల్లర్ల దోపిడీ ఏంది?.

– రాగంశెట్టి చంద్రయ్య, దొనబండ

### ఎక్కడా కటింగ్ లేదు..



జిల్లాలో ఏ మిల్లర్ కూడా ధాన్యం కట్టింగ్ పెట్టొద్దని చాలా సీరియస్‌గా చెప్పాం. నేను రోజూ కొనుగోలు కేంద్రాలు, మిల్లులను తనిఖీ చేస్తున్నా. ఎక్కడా ఇబ్బందులున్నట్లు మా దృష్టికి రాలేదు. క్షేత్రస్థాయిలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా ధాన్యం సేకరిస్తున్నాం. అక్రమాలు జరిగినట్లు మా దృష్టికి వస్తే వెంటనే చర్యలు తీసుకుంటాం.

– మోతీలాల్, అదనపు కలెక్టర్, మంచిర్యాల జిల్లా